

# నీకు రెండు నాకు మూడు

## వేదాంతం శ్రీపతిశర్మ

రైల్వే వాళ్ల నామకరణాలు చిత్రంగా వుంటాయి. రైల్లో ప్రక్కగా వున్న బెర్త్‌ను సైడ్ లోయర్, సైడ్ అప్పర్ అంటూ వ్యవహరిస్తుంటారు. వివాహాలు చేసుకొని జీవితంలో సైడ్‌లైన్ అయిపోయిన వారెందరో అలా కిటికీలోంచి కనిపిస్తున్న దాన్ని రైల్లోంచి చూస్తున్నట్లు చూస్తూ అలా ప్రయాణం సాగిస్తూ వుంటారు. కొంత మంది ఏమీ అనలేక, లేక అనుకోలేక తలలు వంచుకొని వుంటారు (సైడ్‘లోసర్’లో వీళ్లు వుంటారు).

ఈ రైలు ఎందుకో ఇలాంటి వారినెక్కువగా ఎక్కించుకొని అలా పోతోందనిపించింది. సినిమా కంటే ఎక్కువ సినిమా చూసే వాళ్లని చూడడం నాకున్న చెడ్డ అలవాట్లలో ఒకటి. ఇంట్లో నేను టీవి ముందు కూర్చున్నా దానిని ఎక్కువగా చూడను. దానిని చూసే వాళ్ల ముఖ కవళికలను పరిశీలించడంలో నాకు ఎక్కువ వినోదం కనపడుతుంది. పైగా నా కుడి పక్క కూర్చున్న యువ జంట మరింత ఆసక్తికరంగా తోచింది. ఏదైనా స్టేషన్లో రైలు ఆగగానే అతను ‘అరె... సపోటాలు’ అంటాడు. ఆమె అంత కన్నా గట్టిగా ‘అయ్యో, సపోటాలండీ’ అంటుంది. అతను కిటికీ చువ్వలను విరిచినంత పని చేసి ‘సపోటా’ అని అరు

స్తాడు. ఆ సపోటా అబ్బాయి వాటన్నింటినీ కింద పడెయ్యబోయి కిటికీ దగ్గరకి వచ్చి నిలబడతాడు. ఇద్దరూ ఒకళ్ల మొహాలొకళ్లు చూసుకుంటారు. లోపల ఏదో మంత్రం లాంటిది చదివేస్తారనుకుంటాను. ఇంతలో అతను లెక్క చెపుతాడు. 'నీకు రెండు నాకు మూడు' అని సపోటాలు కొంటాడు. సీటు మధ్యలో పాచికలు ఆడుతున్నట్లు పండ్లన్నీ పెట్టి బండి కదిలే వరకూ ఆగి కదలగానే వాటిని సేవిస్తారు.

★★★

రైలు ప్రయాణం కొత్తగా పెళ్లయిన వారి జీవనయానం బాగానే వుంటుంది. స్టేషన్లో ఆర్భాటంగా అనౌన్స్‌మెంట్ జరుగుతుంది. శుభలేఖలతో మొదలయి దర్జాగా పెళ్లయిపోతుంది. బండి సాఫీగా చప్పుడు లేకుండా కదిలిపోతుంది. అందరూ టాటాలు చెబుతారు. ఊరు దాటగానే ఎందుకో రైలు ఆగిపోయి 'అయ్యో' అన్నట్లు చిన్నగా కూస్తుంది. కొత్త జంటలకీ ఇదే సమస్య. ఈ బండీ ఎందుకెక్కామా అని ఆలోచిస్తారు. కానీ రైలు వాళ్లని మళ్లీ మళ్లీ ఆలోచించుకోండి అన్నట్లు రెండు మూడు సార్లు కూసి చిన్నగా తప్పదన్నట్లు కదులుతుంది. నువ్వు ఇలాంటివాడివి అనుకోలేదని అమ్మాయి అనుకుంటుంది. ఇప్పుడిలా వున్నావు. మరి ఇంకెప్పుడు ఎలాగో అని అబ్బాయి చప్పరించుకుంటాడు. తప్పేదేముంది అని ఒకళ్ల మొహాలొకళ్లు చూసుకొని నిట్టూరుస్తారు. బండీ అలా సాగుతూ వుంటుంది.

అదలా వుంచండి. ఈ సైడ్ బెర్త్‌లు వైవాహిక జీవితాన్ని అధ్యయనం చేసి సృష్టించి వుంటారు. 'ఆ మాత్రం అడ్జెస్ట్‌మెంట్ వుండాలి అన్నట్లు ఒకళ్ల పక్కగా మరొకళ్లు కాళ్లు చాపి కూర్చోవచ్చు. కాళ్లు పట్టమనే ధైర్యం లేకపోయినా కాళ్లు చాపగలిగాననే సంబరం అబ్బాయికి మిగులుతుంది! కాళ్లు ఆయన వైపుకు పెట్టినా ఏమీ అనుకోరు, మా ఆయన బంగారం అని అమ్మాయి మురిసిపోతూ రెండు చేతులూ బుగ్గల మీద పెట్టుకొని ఆలోచిస్తూ వుంటుంది. కోపంలో ఒకళ్ల మొహాలొకళ్లు చూసుకోవాలని లేకపోతే వీలుగా కొద్దిసేపు ఆ కిటికీ లోంచి చూడవచ్చు!

ఏవో ఆలోచనలతో ఈ ప్రయాణం సాగుతోంది...సాగుతోంది... అనే లోపల ఆగి కూర్చుంది. 'ఎయిడ్స్ గురించి చర్చిద్దాం' అన్నాడు అతను. నేను నా సీట్లో వెనక్కి వాలిపోయాను.

'ఎందుకు?' ఆమె గాభరాగా అడిగింది. అతను కళ్లజోడు జారుబండ లాంటి ముక్కు మీద నుండి పైకి తోశాడు.

'మనం కాదు...' అన్నాడు. '...అదుగో, అక్కడ వ్రాసి వుంది!'

అమ్మాయి చిన్నగా నవ్వింది. 'అరె...' అన్నాడతను. '....మామిడి ముక్కలు కోసి అమ్ముతున్నాడు'

అమ్మాయి జాగ్రత్తగా చూసింది.

'అయ్ బాబోయ్ మామిడి ముక్కలండీ!'

ఆ కుర్రాడు వాటి మీద పొడి చల్లుకుంటూ దగ్గరికొచ్చాడు. ఇద్దరూ చూపులు కలిపారు.

'నీకు రెండు నాకు మూడు' నిర్ద్వంద్వంగా సెలవిచ్చాడతను. సీటు మధ్యలోకి ఆ ముక్కలు వచ్చాయి. బండీ కదిలింది.

★★★

కూర్చునే నిద్రపోతూ కుదుపుకి కళ్లు తెరిచాను. అతను టాయిలెట్‌కి వెళ్లినట్లున్నాడు. ఆమె నన్ను తీవ్రంగా చూస్తోంది.

'ఎందుకు నవ్వుతున్నారు?' అడిగింది. ఆలోచించాను. ఈ రెండు, మూడు వ్యవహారం వలన ఏదో నాలో నేను నవ్వుకోవడం గమనించినట్లుంది. ఆడవాళ్లు నవ్వినా, ఎందుకు నవ్వావని అడిగినా ఏదో పిడుగుపడ్డట్లే. కిటికీ అవతల ఏదో కొండ మీద ఒక చిన్న గుడి కనిపించింది. అందులోని దేవుడికి నమస్కారం పెట్టుకొని గొంతు సర్దుకున్నాను.

'ఏం లేదండీ. మీ ఆయన ఏది కొన్నా నీకు రెండు నాకు మూడు అంటుంటే ఎందుకో చిన్నగా నవ్వొచ్చింది. దట్సాల్'

ఆమె చక్కగా నవ్వింది.

'ఇదో చిన్న తమాషా. మేము ఇలా కావాలని ఆడుకుంటూ వుంటాము. ఆయన ప్రతిసారీ అలా అనాలనే నేను కనిపించినవన్నీ కొనమంటూ వుంటాను'

నా ఎదురుగా కూర్చున్న ఇద్దరు మహిళలు ఆమెకు దగ్గరగా జరిగారు.

'అలా ఎలా కుదురుతుంది?...', ఒక మహిళ అడిగింది. '...చెప్పకుండా వదలం. చెప్పు తల్లీ, టైం పాస్!'

రైలు నేనూ మగాడినే అన్నట్లు స్పీడు పుంజుకుంది. ఆమె అటూ ఇటూ చూసి హ్యాండ్ బ్యాగ్ తడుముకుంది. కాఫీ అమ్మే వాడు అడ్డుగా వుంటే వెళ్లిపోయే వరకూ చూసింది.

'ఈ ఆట ఆయన పెళ్లి రోజు నుంచీ ఆడుతున్నారు...' చెప్పింది. '....భోజనాల వడ్డన చేసేవాడితో కూడా ఇంతే! నాకు రెండు స్వీట్స్ వడ్డిస్తే ఆయన మూడు అడిగి వడ్డించుకున్నారు. ఇదేదో అలవాటో లేక నమ్మకమో అనుకున్నాను. ఒకరోజు షాపింగ్‌కి వెళ్లినప్పుడు చాలా ఆశ్చర్యం వేసింది. నేను రెండు చీరెలు కొనుక్కుని ఆటోలో కూర్చున్నాను. ఆటో ఆపేవరకూ ఆయనకి తోచలేదు. ఇంకొక షాప్‌లోకి వెళ్లి మూడు షర్ట్స్ కొని హాయిగా శ్వాస పీల్చి మరల ఆటో ఎక్కారు. పైగా నాకెందుకో థ్యాంక్స్ కూడా చెప్పారు.'

సత్యనారాయణ స్వామి వ్రతంలో ఒక అధ్యాయం పూర్తి అయినట్లు ఇద్దరు మహిళలూ సర్దుకొని విషయాన్ని కొద్ది సేపు పరిశీలించారు.

'అది కాదమ్మాయ్! ఇదంతా పురుషాధిక్యత! ఈ మగాళ్లకి ఇదో దిక్కుమాలిన అలవాటు'

ఆ రెండో మహిళ లేచి ఆమె ఎదురుకుండా సెటిల్ అయిపోయింది. అడ్డంగా తగిలిన వాటర్ బాటిల్ ఖాళీ చేసింది.

'నేను చెబుతాను...' అంటూ తొడ మీద తాళం వేసింది. పురుషాధిక్యత లేదు పీచు మిఠాయి లేదు. ఇలా ప్రతిసారీ రెండుకు మూడు కొంటూ వుంటే నువ్వే ఏదీ కొనడం మానేస్తావని అతని పథకం. ఆలోచించు'

'కాదండీ ఏదైనా నా చేత కొనిపించనిదే ఊర్కోరు'

అతను వచ్చి నా ఎదురుగా కూర్చున్నాడు. భార్య ఎదురుగా వున్న మహిళలను లేవనక్కర్లేదని సైగ చేశాడు. 'ఎవరి మెడలో హారం అందంగా వుందోనని చూస్తున్నాను' అన్నాడు.

'మీ కెందుకు?' భార్య అడిగింది.

'రైలు ఆపాలంటే చెయిన్ లాగేయాలని పైన వ్రాశాడు'

అతని జోక్‌కి చిరునవ్వు నవ్వి మాట కలిపాను.

'ఇక్కడ ఒక చర్చ జరుగుతోంది సార్'

'దేని గురించి?'

'నీకు రెండు నాకు మూడు'

అతను మాట్లాడకుండా వాచ్ చూస్కున్నాడు.

'ఇంకొక అయిదు నిమిషాల్లో మీకు నేనే చెప్పేస్తాను'

'అయిదు నిమిషాలెందుకు సార్?'

'టైం రెండుంపావు అవుతుంది. చిన్న ముల్లు రెండు' మీద, పెద్ద ముల్లు మూడు మీద వుంటుంది!'


మహిళలు ఒకళ్ల మొహాలొకళ్లు చూసుకున్నారు. చెట్ల చాటున సూర్యుడు పోటీ పడుతూ పరుగులు తీస్తున్నాడు.

'చిన్న ముల్లే పెద్దది...' అతను మొదలుపెట్టాడు.

'...నువ్వా నేనా అంటూ చిన్నప్పటి నుంచీ నా తల్లిదండ్రులు గడియారంలో ఈ ముళ్లలాగా పోటీ పడుతూనే కాలం గడిపారు. అమ్మ పిచ్చి అని నాన్న అనమనేవారు. నాన్న వెర్రి అని అమ్మ అనమనేది. ఆ పిచ్చి, వెర్రి వీడని అనుబంధంలా పెనవేసుకుపోయి గడియారం ఒక రోజు గంట కొట్టడం ఆపేసింది. ఇద్దరూ ఉద్యోగాలూ చేసుకుంటూ అన్ని రంగాలలోనూ పోటీ పడుతూ ఇక్కడికి కూడా ఎందుకు వెళ్లకూడదని ఒక రోజు వేర్వేరు గేట్ల నుంచి కోర్టులోకి పరుగుదీశారు. గడియారం మరల గంట కొట్టలేదు. సమాజం అనాలో మరి ఏమనాలో, మా ఇంటిని పీకి నాకు హాస్టల్లో పంది రేసింది....'

'...నువ్వా నేనా అంటూ చిన్నప్పటి నుంచీ నా తల్లి దండ్రులు గడియారంలో ఈ ముళ్ల లాగా పోటీపడుతూనే కాలం గడిపారు. అమ్మ పిచ్చి అని నాన్న అనమనేవారు. నాన్న వెర్రి అని అమ్మ అనమనేది. ఆ పిచ్చి, వెర్రి వీడని అనుబంధంలా పెనవేసుకుపోయి గడియారం ఒక రోజు గంట కొట్టడం ఆపేసింది.

అమ్మాయి ఎందుకో తల వంచుకుంది. ఎదురుగా వున్న మహిళ ఎందుకో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లుంది. సమాన హక్కులు వగైరాలు వెర్రితనమా అని శూన్యంలోకి చూస్తూ ప్రశ్నిస్తున్నట్లుంది.




నన్ను కూడా ఎందుకో కోపంగా చూసింది. ఎందుకైనా మంచిదని నేను చేతులు కట్టుకున్నాను. నిజమే ఎవరి ఆలోచనలు వారివి. సంసారం అనేది చాలా సింపుల్! ఇద్దరూ ప్రక్కప్రక్కగా నడవాలి... అగ్ని హోత్రం చుట్టూతా కూడా! భార్య ఆవులిస్తే భర్త చిటికె వేయాలి. ద్వారంలోంచి ఇద్దరూ కలిసే ప్రవేశించాలి. అయ్యో! అపార్ట్‌మెంట్లలో అంత పెద్ద ద్వారాలు కావు!

ఒక మహిళ తన గాజులు పైకి తీసింది... 'అందుకని! అన్నింటిలోనూ ఎక్కువని నిరూపిస్తూ వుండాలి?'

అతను ఏదో చెప్పబోయే ముందు అతని భార్య ఆపింది.

'ఇందులో అన్యాయం ఏముంది?' సూటిగా అడిగింది. 'నా మాటేదీ ఆయన కాదనరు. ఆ ఒక్కటీ ఆయనకొదిలేస్తే ఆయన సర్వస్వం నాది! మూడింట రెండింతలు నాదే మెజారిటీ!'

ఆవిడ రైలు పట్టాలు తప్పి కిందకి జారినట్లు జరిగి వెనక్కి ఆనుకుంది. ఈ దేశం బాగుపడదు. అనుకున్నట్లు నన్నెందుకో కోపంగా చూసింది. ఈ రైలు మరో మలుపు తిరుగుతోంది....

'ఇదెక్కడి వింతే తల్లీ! అయిదింట రెండు మెజారిటీ ఎలాగా?'

'మా ఆయన గాజు గ్లాసు లాంటి వారు. ఖాళీగా వున్నప్పుడు అన్నింటినీ ప్రతిబింబిస్తారు. మూడులో రెండు లాగా ఆయనలో నేను నిండి ఇద్దరం నిండు గ్లాసులా వుంటాం. చూసేవారికి ఒక గ్లాసే కనపడుతుంది!'

మరో మహిళ ఇంక లాభం లేదని రంగంలోకి దిగింది.

'అమ్మాయ్, లెక్కలు సరిగ్గా లేకపోతే నువ్వా? నేనా?అనే గొడవ రాదంటావా?'

'తప్పుడు లెక్క కావాలని వేసుకునే చోటే నిజమైన ఆనందం వుంది. గ్లాసులో వున్న దాని అస్తిత్వం గ్లాసుతోనే తెలుస్తుంది. గ్లాసుకీ, జూస్‌కీ పోటీ వుండదు. నువ్వా? నేనా? అనేది పోటీకీ, పోట్లాటకీ తెరిచి వుంచిన తలుపు'

ఆమె ఎదురుగా వున్న మహిళ తొడ గట్టిగా కొట్టుకుంది. 'దొరికావు పిల్లా...' అరిచింది.

'...అసలు సంగతి చెబుతాను. నువ్వా గ్లాసూ రెండు అన్నావుగా! అంచేత నువ్వా నేను అనుకో సినిమా పేరులాగా! ఆలోచించి చూశావా! నువ్వా నేనా బదులు నువ్వా నేను అనుకో. ఇది బావుంది!'

ఆమె మాట వెతుక్కోవడం లేదు. 'అది భాగస్వామ్యం. అది ముసుగులో వున్న ముప్పు! ఆయన ఒకటి. నేను సున్నా... ఒకటి తక్కువ. ఆయన మూడు, నేను రెండు. ఈ సున్నాకి ఆయన పక్కనే విలువ! నేను కనపడకపోతే చిన్నపిల్లవాడిలా వెతుక్కుంటారు. ఒకరినొకరు కాదు. ఇరువురిలో ఇద్దరినీ వెతుక్కుంటూ మేం పదికాలాలు చల్లగా వుంటాం!'

అతను కాలు మీద కాలు వేసుకొని కాలర్ పైకి ఎత్తాడు. నన్ను చూసి కళ్లు ఎగరేశాడు.

'చూశారా?...'అన్నాడు.

'....ఇంతవరకూ నన్ను పిచ్చివాడిని చూసినట్లు చూస్తున్నారు. నేనెవర్ని? నెంబర్ వన్! అదీ సంగతి!'

నా పక్కన కూర్చున్న మహిళకి ఏదో మింగుడు పడడంలేదు.

'నువ్వు ఏదో మరిచిపోతున్నావు పిల్లా. ఒక్కసారి ఆలోచించు. నీ వ్యక్తిత్వం యావత్తూ అలా ధారపోసే ముందు గ్లాసు మంచిదో కాదో చూడవా?'

'రగిలే చిచ్చులోకి కలగచేసుకొని చిచ్చుకొట్టి చల్లార్చి గెలవగలిగే వ్యక్తిత్వం కేవలం స్త్రీకే వుంది. ఏదో కావాలనుకుని దీనిని పోగొట్టుకోవడం న్యాయమా చెప్పండి?'

ఈ రైలు పోతూ వుంది. ఎందుకో వెనక్కి పోతోందా? అనిపించిం. ఎలా వెళ్లినా స్టేషన్ చోటుకు రావాలి. నువ్వా నేనా నుండి నువ్వు నేనూ వరకూ సాగిపోయి నువ్వే నేను దగ్గర ఆగాలి.

★★★

కొద్దిసేపు డోర్ దగ్గర నిలబడ్డాను. సాయంత్రపు గాలి చల్లగా తాకింది. ఈ అమ్మాయి మాటలు గిర్రున తిరుగుతూనే వున్నాయి. పొలాల మాటున పొద్దు తిరుగుడు పూలు దూరంగా అస్తమిస్తున్న సూర్యుని వైపే తిరిగిపోయి చూస్తున్నాయి. వీటి కోసమే కదా ఆయన తిరిగి రేపు ఉదయించేది?

ఈరోజు ఆఫీసుల్లో పనులు ముగించుకొని ఇంత మంది మగవాళ్లు తిన్నగా ఇళ్లకి చేరుకుంటున్నారంటే మరి ఇటువంటి శ్రీమతుల కోసమే కదా?!

రైలు అలవాటుగా మళ్లీ ఆగింది. ఏదో చిన్న స్టేషన్. కిందకి దిగి మా కిటికీ దగ్గర నిలబడ్డాను. ఒక చెట్టు కింద వున్న గట్టు మీద ఒక కుర్రాడు జామకాయలు పెట్టుకుని కూర్చున్నాడు. భార్యాభర్తలిద్దరూ అటే చూస్తున్నారు.

'నేనేమీ కొనను' అతను అన్నాడు.

'ఏమైంది?'

'అక్కడ చూడు ఏం వ్రాసుందో....అపరిచితుల దగ్గర ఏమీ తీసుకోవద్దని వుంది'

ఇద్దరూ నవ్వుకున్నారు.

'పెళ్లికి ముందర ఇద్దరం అపరిచితులమే....' ఆమె అంటోంది. '...నేనెలా పుచ్చుకున్నాను.'

'నాకు ఒక ఇల్లే...' అతను చెబుతున్నాడు.

'....అది ఎలాంటిదైనా నీ చేతిలో వుంది. పుట్టినదీ, మెట్టినదీ...నీకు రెండు...నాకు ఒకటే! నా వలన రెండు ఇళ్ల నీవి!'

'మరి జామకాయలు'

'అరె జామకాయలు'

'అయ్యో బాబోయ్ పిలవండీ'

ఇద్దరూ ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూసుకున్నారు.

'నీకు రెండు నాకు మూడు'.... ఆ కుర్రాడి దగ్గర కెళ్లాడు.

'పదికి ఆరు'

'అయిదే కావాలి'

'చిల్లర లేదు' గార్డ్ ఈల వేశాడు. ఒక కాయ నేను తీసుకుంటూ

'తీస్కోండి...' అన్నాను.

'మీకో బాబు పుడితే తీస్కోరా?'

కుర్రాడు పదిరూపాయల కాగితం తీసుకొని వెళ్లిపోయాడు. అయిదు కాయలు యధావిధిగా సీటు మధ్యలో పెట్టుకున్నారు. బండీ కదిలింది. నన్ను ఎక్కమన్నట్లుగా చూస్తున్నారు. నేను ఇవతల డోర్ లోంచి ఎక్కి నా సీట్లో కూర్చున్నాను. ఇద్దరూ ఇంకా నా కోసమే కిటికీని ఆనుకుని చూస్తున్నారు.

'మన బాబు ఎక్కలేదు పాపం' అతను అంటున్నాడు.

'లేదండీ, ఆయన ఎక్కేసే వుంటారు'

'ఎంత పందెం? నే గెలిస్తే మూడు రూపాయలు. నువ్వు గెలిస్తే రెండు' ఇంతలోనే ఇటు తిరిగారు.

'అరె... ఇటు నుంచి వచ్చారా?'

'అవును...' అన్నాను.

'.... ఆవిడే గెలిచారు' అని ఆ కాయ ఆమె చేతిలో పెట్టాను. అవునన్నట్లు రైలు కూడా ఓ కూత కూసేసి వేగం పుంజుకుంది. ★